క్లుప్తంగా

ఎమ్మార్పీ కంటే అత్యధికంగా విక్రయిస్తే చర్యలు

నగరంపాలెం: జిల్లాలో ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని రీజినల్ విజిలెన్స్/ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు అన్నారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం గుంటూరు నగరంలోని చుట్టుగుంట, మిర్చియార్డు, ఏటీఅగ్రహారం, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని శీతల పానీయాలు, బేకరి దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని పలు దుకాణాలపై పన్నెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరిరావు తెలిపారు.

గోరక్షణ పాదయాత్ర



గుంటూరు మెడికల్: గో పరివార్ జేఏసీ, గో భక్తుల ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో గో రక్షణ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని అమలు పరచాలని ప్రభుత్వ అధికారుల అందరికీ ఆదేశాలు పంపించడం జరిగిందన్నారు. గోవుల అక్రమ రవాణా నిషేధించాలని, గో సంతతి వధకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు గోమాతలకు రక్షణ కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బజరంగ్ రామకృష్ణ, దుర్గ బాబు, నవీన్ రెడ్డి ,ప్రదీప్ జైన్, డి.సత్యనారాయణ, దర్శనపు శ్రీనివాసు, ధార్మిక సెల్ ప్రసాదు, హైందవ శక్తి ప్రసాద్, వనమా నరేంద్ర పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం, డాక్టర్ పట్టాభి కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రచయితలు పాల్గొనాలని కోరారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులకు కళాశాల విద్య ఆధ్వర్యంలో సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈసందర్భంగా ఆంగ్ల మాధ్యమ బోధన పద్ధతులపై శిక్షణ పొందిన అధ్యాపకులకు ప్రభుత్వ మార్గదర్శకాలు, శిక్షణ కార్యక్రమ ఉద్దేశాన్ని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.కోటేశ్వరరావు వివరించారు. కో–ఆర్డినేటర్ కె.చంద్రశేఖరరావు, ఎన్ఆర్సీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, మాస్టర్‌ట్రైనర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై రుద్ర కళాక్షేత్రం 9వ వార్షికోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి, ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాతమ్మ, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాట్య సమ్మోహనం పేరున రుద్ర కళాక్షేత్రం, వివిధ రాష్ట్రాలకు చెందిన నాట్యాచార్యుల విద్యార్థులు కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ మహంకాళి శ్రీనివాసరావు, నలవాగు బాలసుబ్రహ్మణ్యాచారి, డాక్టర్ వంగివరపు శారదాదేవి పాల్గొన్నారు. రుద్ర కళాక్షేత్రం ప్రిన్సిపాల్ మాచిరాజు రాజేష్ నిర్వహించారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: వివాహిత అపార్టుమెంటు 5వ అతంస్తు నుం- కిందపడి మృతిచెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. భారత్‌పేటలోని ఏలైట్ అపార్టుమెంటులో నివసిస్తున్న ఓ కుటుంబానికి చెందిన లక్ష్మీ ప్రసన్న(26) శనివారం రాత్రి అపార్టుమెంటు 5వ అంతస్తు నుంచి కిందపడి మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి విచారిస్తున్నారు.

వలంటీర్ వ్యవస్థపై టీడీపీ దుష్ప్రచారం

- టీడీపీ కార్పొరేటర్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ డిమాండ్
- నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌కు వైఎస్సార్ వాకింగ్ ట్రాక్‌గా పేరు మార్పు
- వీధి కుక్కలను కట్టడి చేయాలని తీర్మానం



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో టీడీపీ కార్పొరేటర్ల వాగ్వివాదం

నెహ్రూనగర్: కోవిడ్ సమయంలో వలంటీర్లు చేసిన సేవ మరువలేనివని అటువంటి వలంటీర్ వ్యవస్థపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కార్పొరేషన్ సాధారణ సమావేశం శనివారం రెండో రోజు నిర్వహించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఓటర్లు సర్వే వలంటీర్లు చేశారని, చదువులేని వలంటీర్లు ఓటర్ల జాబితా సర్వే చేయడంపై టీడీపీ కార్పొరేటర్ ఇసుక బుజ్జి ఆరోపించారు. దీనిపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, బూసి రాజలత, మల్లవరపు రమ్య ఇతర కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కోవిడ్ సమయంలో టీడీపీ నాయకులు ఇంట్లో ఉన్నప్పటికి వారికి అవసరమైన సేవలందించిన విషయం మార్చిపోయారా అంటూ ప్రశ్నించారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని అటువంటి వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన టీడీపీ వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌కు వైఎస్సార్ వాకింగ్ ట్రాక్‌గా పేరు మార్చాలని స్థానిక కార్పొరేటర్ వేముల జ్యోతి ప్రతిపాదన మేరకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సంకూరి శ్రీను కోరారు. ఎమ్మెల్యే ముస్తఫా కలగజేసుకుని రెండు సంవత్సరాలు పనులు చేస్తున్నట్లు చెబుతున్నారే తప్ప పనులు ప్రారంభించడం లేదని ఆరోపించారు. 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ డివిజన్ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని 163 అడ్మిన్ సెక్రటరీ చల్లా వీరాంజనేయులును కోరగా అతను తానను అగౌరవంగా మాట్లాడారని దీనిపై జిల్లా కలెక్టర్, మేయర్, కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

వలంటీర్లను టీడీపీ నాయకులు బెదిరించారు

టీడీపీ నాయకులు వార్డుల్లో వలంటీర్లు తిరుగుతుంటే ఆడపిల్లలని చూడకుండా వారిని భయపెట్టి భాయభ్రాంతులకు గురి చేశారని మండిపడ్డారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు చేసిన కొనియాడతగినదని వారిని అవమానపరచడం సిగ్గుచేటన్నారు.

– మద్దాళి గిరిధర్, పశ్చిమ ఎమ్మెల్యే

అవకాశాలను అనుకూలంగా మలచుకుంటే విజయం

సివిల్స్ 60వ ర్యాంకర్ ప్రణవ్



బసవపున్నయ్యను సత్కరిస్తున్న ప్రణవ్, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వేమన కుప్పస్వామి

గుంటూరు ఎడ్యుకేషన్: అందివచ్చిన అవకాశాలను అనుకూలంగా మలచుకుంటే ఎంచుకున్న రంగంలో విజయం తథ్యమని సివిల్స్ ఫలితాల్లో 60వ ర్యాంకు సాధించిన సి.ప్రణవ్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపక దినోత్సవం శనివారం నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ప్రణవ్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రవణ నైపుణ్యాన్ని సాధించడం ఎంతో కీలకమని అన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని, దానిని అనుకూలంగా మలచుకుని నాయకులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో కర్తవ్యపాలన, నిర్వహణ బాధ్యత, సమయపాలన నైపుణ్యాలను పెంపొందించేందుకు సహకరిస్తుందని అన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేఎల్‌పీ పాఠశాల పూర్వ విద్యార్థి, సివిల్స్‌లో జాతీయస్థాయిలో 60వ ర్యాంకు సాధించిన ప్రణవ్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత ఆశయంతో ఎదగాలని సూచించారు. అనంతరం ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఎస్‌పీఎల్, ఉప ఎస్‌పీఎల్‌ను హౌస్ మాస్టర్లు, విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి, ఏఓ కె.వెంకట్రావు, పాలకవర్గ సభ్యులు రత్నగిరిబాబు, మురళీమోహన్, కుప్పు స్వామినాయుడు పాల్గొన్నారు.

గోవధ చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

గుంటూరు వెస్ట్: త్యాగానికి గుర్తుగా జరుపుకునే పవిత్ర బక్రీద్ పండుగను సామరస్య వాతావరణలో నిర్వహించాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా జంతు హింస నివారణ సంఘం సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 29న బక్రీద్ పండుగకు గోవధ గాని, అనుమతి లేని జంతువులను గాని వధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జంతు రవాణాకు సరైన అనుమతి పత్రాలు లేనిదే అనుమతించమన్నారు. గుంటూరులో కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను మోహరిస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ పండుగలంటే సంతోషంగా జరుపుకునేవని చెప్పారు. గోవధగాని, అనుమతి లేని జంతువుల అక్రమ రవాణాని, అక్రమ వధను గుర్తిస్తే పోలీస్ శాఖ నంబర్ 86888 31391, పశుసంవర్ధక శాఖ నంబర్ 94940 55924, జీఎంసీ నంబర్ 93429 29342 సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

మత పెద్దలతో సమావేశం..

పట్నంబజారు: బక్రీదు పండుగ పురస్కరించుకుని శనివారం లాలాపేట పోలీసు స్టేషన్‌లో లాలాపేట , పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓలు ఎస్.సుబ్బారావు, ఎస్.వి.సుబ్బారావు, ముస్లిం మత పెద్దలు, గోమాంస విక్రేతలతో సమావేశం నిర్వహించారు.

యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పూర్వ విద్యార్థుల సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్యకరుణ



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: యూనివర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శనివారం జరిగిన యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఆర్ట్స్ కళాశాలలో పలు కోర్సులు చదివిన వారు ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత స్థాయిల్లో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఎంత ఎదిగినా చదివిన యూనివర్సిటీని, కుటుంబాన్ని మర్చిపోవద్దని సూచించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి ప్రసంగిస్తూ ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో చదివిన వారు పలు రంగాల్లో కీలక స్థానాలు పొందారన్నారు. యూనివర్సిటీ కళాశాలలో విద్య, పరిశోధనా కోర్సులు చేసిన వారు ఇక్కడే వీసీలు, అధ్యాపకులుగా కూడా పని చేసి విలువైన సేవలు అందించారని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి ప్రసంగిస్తూ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. యూనివర్సిటీకి అన్ని విధాలుగా సహకారం అందించాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. సీడీసీ డీన్ ఆచార్య కె. మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, యూనివర్సిటీ పాలకమండలి మాజీ సభ్యుడు ఆచార్య డీఏఆర్ సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. పలువురు పూర్వ విద్యార్థులు యూనివర్సిటీతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. యూనివర్సిటీకి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

సోషియాలజీ , సోషల్ వర్క్ విభాగంలో...

యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగంలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య వి. వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ పూర్వ విద్యార్థులు విభాగాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, విభాగ అధ్యాపకులు ఆచార్య త్రిమూర్తిరావు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథోత్సవం



పాత గుంటూరు: గుంటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో వార్షిక శ్రీ జగన్నాథ రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ దేవాలయం అధ్యక్షులు పుండరీక గోవింద్‌దాస్ నిర్వహణలో ప్రారంభమైన రథోత్సవం కీర్తనలతో నగరంలోని ప్రధాన వీధుల్లో సాగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని జగన్నాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జగన్నాథ బలదేవ సుభద్రలకు మహానివేదన, హారతి, జగన్నాథ లీల కథాశ్రవణం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యక్షులు వీర్ గోవింద్‌దాస్, సీతాకాంత రామదాస్, భగీరథ దాస్, పూర్ణచంద్ర ప్రభు, నాగేంద్ర ప్రభు పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ(సెబ్) గుంటూరు–1 స్టేషన్ సీఐ ఎం.రమేష్ అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా శనివారం ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–1 స్టేషన్ ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాల వాడకంతో కొందరి జీవితాలు అర్థాంతంగా ముగిసిపోతున్నాయని అన్నారు. కేసులు నమోదుతో మరింత దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తారని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజమే సంక్షేమానికి సంకేతమని అన్నారు. పరిసర ప్రాంతాల్లో, విద్యా సంస్థల్లో డ్రగ్స్, గంజాయి వాడకంపై సమాచారం ఉన్నట్‌లైతే టోల్ ఫ్రీ నంబర్ 14500కు ఫిర్యాదు చేయాలని అన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

అమర్నాథ్ గౌడ్ హత్య నిందితులను శిక్షించాలి

నెహ్రూనగర్: అమర్నాథ్ గౌడ్‌ను హత్య చేసిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ అసోసియేషన్ హాల్లో అమర్నాథ్ గౌడ్ సంస్మరణ సభలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) మాట్లాడుతూ అమర్నాథ్ గౌడ్ ఘటన మొదటిది కాదని... అదే విధంగా ఇది చివరిది కాదని, ఈ సమాజంలో వివక్షతకు గురవుతున్న సామాజిక వర్గాలకు ఈ విధంగా పరిపాటిగా మారిందన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినపుడు ప్రభుత్వాలు వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులను శిక్షిస్తే ఇటువంటి ఘటనలు పునరావృతం కావన్నారు. అమర్నానాథ్ గౌడ్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగ ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎస్ఎస్ శిక్షణతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు



విద్యార్థులను అభినందిస్తున్న రవిశంకర్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్ఎస్ఎస్ శిక్షణతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఏఎన్‌యూ జాతీయ సేవా పథక విభాగ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం ఏఎన్‌యూలో రవిశంకర్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా టీజేపీఎస్ కళాశాల నుంచి ముగ్గురు నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొని వచ్చిన ముగ్గురు విద్యార్థులను అభినందించారు. ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు సేవా భావాలు, ధైర్య, సాహసాలు, ఆత్మ విశ్వాసం వంటివి అలవడటమే కాకుండా, జీవితాల్లో ఆటు పోట్లను ఎదుర్కొనే శక్తి ఏర్పడుతుందని చెప్పారు. కాలంలో మార్పుల వలన విద్యార్థుల్లో సేవా దృక్పథం, తోటివారికి సాయం చేసే తత్త్వం తగ్గిపోతున్నాయని, సాధ్యమైనంత వరకు సామాజిక సేవా భావాలు ప్రజల్లోకి వెళ్లే విధంగా చేసే బాధ్యత జాతీయ సేవా పథక విద్యార్థులపై ఉందని తెలిపారు. దీనిని బరువుగా కాకుండా ఒక బాధ్యతగా భావించి, సామాజిక సేవ చేయాలని సూచించారు.'సొంత లాభం కొంత మానుకు పొరుగు వానికి తోడు పడవోయ్ 'అన్న గురజాడ అప్పారావు మాటలు స్ఫూర్తిగా తీసుకుని, వివేకానంద భావాలను అలవరుచుకుని, మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ కె.వీర బ్రహ్మం అభినందించారు.

ఆకట్టుకున్న గణిత అవధానం



గణిత అవధానం చేసిన విద్యార్థులతో మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని పెరల్స్ హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన గణిత అవధాన కార్యక్రమం ఆకట్టుకుంది. ఏడో తరగతి విద్యార్థులు పి.కిషోర్ జయదేవ్ రెడ్డి, సి.ఆద్యంత రామన్ నాయుడు గణితంలో ప్రతిభ కనబరిచారు. వంద టేబుల్స్ ఎక్కడ అడిగినా వెనువెంటనే సమాధానం ఇవ్వడంతో పాటు ఒకటి నుంచి 100 స్క్వేర్స్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, 2100 వరకు క్యాలెండర్‌లోని తేదీలతో పాటు అన్ని అంశాలను తడుముకోకుండా సమాధానాలు చెప్పి విద్యార్థులందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. ఈ సందర్భంగా 11 ఏళ్ల వయసులో ఆరో తరగతి చదువుతూ తనలోని అమోఘమైన ప్రతిభా సంపత్తులతో ఇటీవల టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసి 566 మార్కులను సాధించిన అనఘా లక్ష్మి కార్యక్రమంలో పాల్గొని 1000 టేబుల్స్ అలవోకగా చెప్పటంతో పాటు గణితంలోని వివిధ అంశాలపై అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఈసందర్భంగా విద్యార్థులను సత్కరించి, ప్రశంసాపత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, వైస్ ప్రిన్సిపాల్ సాయి కిరీటి, డైరెక్టర్ బాబూరావు, అకడమిక్ అడ్వైజర్ ప్రసన్న, యోగాచార్య అచ్యుత ఇందుశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి రూ.11లక్షల విరాళం



గ్రంధి కాంతారావును సత్కరిస్తున్న నరసింహారావు, కమిటీ సభ్యులు

పాత గుంటూరు: హిందూ ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు చేస్తున్న కృషి అభినందనీయమని గంటలమ్మ చెట్టు వీధి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొత్తూరి వెంకట నరసింహారావు అన్నారు. శనివారం సంపత్‌నగర్‌లోని క్రేన్ సంస్థ ప్రధాన కార్యాలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆధునికీకరణకు గ్రంధి కాంతారావు రూ.11 లక్షల చెక్కును ఆలయ పాలక వర్గానికి అందించారు. గతంలో కూడా ఆలయ అదనపు స్థల సేకరణకు రూ.11 లక్షలు ఇచ్చారు. ఆలయ పాలకవర్గం కాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి తెల్లాకుల లక్ష్మీ గురు ప్రసాద్, కోశాధికారి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, ఎస్.ప్రకాష్‌రావు, సీహెచ్ పుల్లారావు, డి.రాధాకృష్ణ, జి.హరి, ప్రసాద్, జి.సురేష్, జె.సుబ్బారావు, టి.నగేష్ పాల్గొన్నారు.

మహిళ చేతిలో బ్యాగు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ చేతిలో బ్యాగు దుండగుడు లాక్కొని వెళ్లిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శివరామ్‌నగర్ రెండోలైనుకు చెందిన ఎం.విజయలక్ష్మి శనివారం కలెక్టర్ బంగ్లా రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా, ఓ అగంతకుడు ఆమె చేతిలో బ్యాగు లాక్కొని పరారయ్యాడు. బ్యాగులో రూ.10వేలు, సెల్‌ఫోన్, కొంత బంగారం ఉన్నట్లు విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధార్థ మెడికల్ కళాశాలకు డాక్టర్ కల్యాణి రమ బదిలీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కార్డియోథొరాసిక్ సర్జరీ వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి కల్యాణి రమను విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో ఈమెను విజయవాడకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయవాడలో పనిచేస్తున్న డాక్టర్ ఎం.మోతీలాల్‌ను గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ చేశారు. డాక్టర్ కల్యాణి రమ తక్షణమే విధుల్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మికి అప్పగించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. సహృదయ ట్రస్టు నిర్వాహకులు, ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో గుంటూరు జీజీహెచ్‌లో గుండె బైపాస్ సర్జరీలు చేసేందుకు డాక్టర్ కల్యాణి రమ సహకారం అందించడం లేదనే ఫిర్యాదులతో ఆమెను బదిలీ చేశారు. డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో నాలుగేళ్ల వ్యవధిలో 500కు పైగా బైపాస్ సర్జరీలతోపాటు గుండె మార్పిడి ఆపరేషన్లు సైతం చేసి జీజీహెచ్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా మారుమోగేలా చేశారు. గత ప్రభుత్వంతో డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలోని సహృదయ ట్రస్టు చేసుకున్న ఒప్పంద కాలపరిమితి ముగియడంతో మరలా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు గుండె ఆపరేషన్లు చేసేందుకు అనుమతులు మంజూరు జారీ చేసింది. సుమారు ఆరు నెలలుగా ఆపరేషన్లు చేసేందుకు సౌకర్యాల్ని కల్పించకుండా సీటీఎస్ వైద్యులు సహాయ నిరాకరణ చేయడం వల్లే ప్రక్రియ జాప్యం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో డాక్టర్ కల్యాణి రమపై బదిలీ వేటు పడింది.

సోమవారం బైపాస్ సర్జరీ

డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో బైపాస్ సర్జరీ ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి తెలిపారు. ఆదివారం డాక్టర్ గోఖలేతోపాటు, ఆయన వైద్య బృందం జీజీహెచ్‌కు వస్తున్నట్లు వెల్లడించారు.

జీజీహెచ్ ఉద్యోగి హత్య..!



గుంటూరు ఈస్ట్: గుంటూరు జీజీహెచ్‌లో తోటమాలి దొప్పలపూడి సాల్మన్‌రాజు(45) మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. వివరాలు.. సాల్మన్‌రాజు జీజీహెచ్‌లో తోటమాలిగా పనిచేస్తున్నాడు. అంకమ్మనగర్ రెండోలైనులో నివాసం ఉంటున్నాడు. ఈనెల 22వ తేదీ గన్నవరంలోని కోర్టులో ఓ కేసు విషయంలో హాజరయ్యేందుకు కారులో వెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి తణుకు, రాజమండ్రి, సాగర్ వెళ్లి ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి గుంటూరులోని తన నివాసానికి చేరుకున్నాడు. అయితే డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డి, సాల్మన్‌రాజును కారులో వదిలి సాల్మాన్‌రాజు కుమారుడు సందీప్‌కు ఫోన్ చేశాడు. సందీప్ నిద్రలో ఉండి ఫోన్ ఎత్తలేదు. శ్రీకాంత్‌రెడ్డి, సందీప్‌కు మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడు. ఉదయం లేచి కారు అద్దాల్లోనుంచి పరిశీలించగా సాల్మన్‌రాజు కనిపించలేదు. శ్రీకాంత్‌రెడ్డి సెల్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. సందీప్ తన తండ్రి ఆచూకీ కోసం వెతికి మధ్యాహ్నం కారును పూర్తిగా పరిశీలిస్తే సాల్మాన్‌రాజు కారు వెనుక సీటులో కిందపడి ఉన్నాడు. అతడిని జీజీహెచ్‌కు తరలించగా, వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. సాల్మాన్ ఒంటిపై పలు చోట్ల గాయాలు ఉన్నాయి. చర్మం తీవ్రంగా కమిలిపోయి ఉంది. జీజీహెచ్ వైద్యులు సాల్మన్‌రాజు మృతిపై ఎంఎల్‌సీ రాశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సాల్మన్‌రాజు మృతికి కారణాలు తెలియవస్తాయని వైద్యులు చెబుతున్నారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కొండవీటి నరసింహారావు తెలిపారు. శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని బాలికల వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో నరసింహారావు మాట్లాడుతూ ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం స్కూల్లో 40 మంది పేద విద్యార్థులకు రూ.రెండు లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్, ఏఎన్‌యూ విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్, పెద్ది సాంబశివరావు, ప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, శ్రీహరిరావు, కె. హనుమంతరావు పాల్గొన్నారు.